63

# బయట పడ్డ బండారం

"ఇదుగో ... మీ తమ్ముడు గోపాలం ఉత్తరం రాశాడు. ఏదో ఆఫీసు పనిమీద వస్తున్నాడట. రెండు రోజులుంటానని రాశాడు" అన్నాడు ఇంట్లోకి వస్తూ మల్లేశం.

"రాక రాక వస్తున్నాడు. సంతోషమే కాని, అమ్మాయి జ్వరంతో మనసు మనసులో ఉండడం లేదు. వాణ్ణి ఏం చూస్తానో ఏమో!" అంది పార్వతి దిగులుగా.

"డాక్టర్‌కి చూపిస్తూనే ఉన్నాం కదా... నెమ్మదిగా తగ్గుతుంది. కొన్ని జ్వరాలు ఎక్కువ రోజులు తీసుకుంటాయి" అన్నాడు మల్లేశం.

"ఇన్నాళ్ళు తగ్గకపోతే గాలో, ధూళో కావచ్చు, ఎవరేనా చేతబడి చేసి ఉండొచ్చు. ఓసారి పక్క ఊళ్ళో ఉన్న భూతవైద్యుడికి చూపించితే బాగుంటుంది. ఆయన ఎన్నో మొండి వైద్యాలను కూడా కుదిర్చాడట. పక్కింటి పంతులు గారి భార్య చెప్పింది" అంది పార్వతి.

"సరే... చూద్దాం లే!" అన్నాడు మల్లేశం.

"చూద్దాం- అంటే కుదరదు. ఇప్పటికే ఇరవై రోజులు దాటింది. రేపే తీసుకు వెళ్దాం. ఆఫీసుకి సెలవు పెట్టండి" అంది పార్వతి.

"నాకు రావడం కుదరదు. మీ తమ్ముడు వచ్చేది రేపే! ఇద్దరూ కలిసి ఏదో టైంలో వెళ్ళి రండి" అన్నాడు మల్లేశం.

మల్లేశం మొండి మనిషి. అతనితో వాదించి లాభం లేదనుకుని ఊరుకుంది పార్వతి.

మర్నాడు పొద్దున్నే బస్సుకి వచ్చాడు గోపాలం.

"రా... తమ్ముడూ..!" అంటూ ఆప్యాయంగా పిలిచింది పార్వతి.

"అక్కా! బావగారేరీ? ఇంట్లో అందరూ ఎలా ఉన్నారు?" అని కుశలాలు అడిగాడు గోపాలం.



"ఆయన బయటికి వెళ్లారు. ఓ గంటలో వస్తారు. అందరం బాగానే ఉన్నాం. కాని, మా ఉష ఒళ్ళు బాగుండడం లేదురా! ఇరవై రోజులైనా జ్వరం తగ్గడం లేదు" అంది పార్వతి.

"మరి... పెద్ద డాక్టర్‌కి చూపించారా?"

"ఈ పల్లెటూళ్ళో అంత పెద్ద డాక్టర్లు లేరు. ఉన్న డాక్టరు అదే తగ్గిపోతుందంటూ ఏవో మందులు ఇస్తున్నాడు. అది సరే... రేపు నీకు ఆఫీసు పని ఉందా?" అని అడిగింది పార్వతి.

"లేదు. ఎల్లుండి ఉంది. అందుకే మీతో గడుపుదామని రెండు రోజులు ముందు వచ్చాను" అన్నాడు గోపాలం.

"అలా అయితే ఓ పని చేద్దాం. పారుగూర్లో ఒక భూత వైద్యుడు ఉన్నాడు. ఆయన ఎటువంటి రోగాలనైనా కుదురుస్తాడని ప్రతీతి. ఆయన కోసారి చూపించి వద్దాం. మీ బావగారికి రావడానికి తీరిక లేదు" అంది పార్వతి.

"ఏమిటక్కా... ఈ భూత వైద్యాలు? ఇవన్నీ మోసం. చదువుకున్నవాళ్ళు మీరూ నమ్మితే ఎలా?" అన్నాడు గోపాలం.

"ఏ పుట్టలో ఏముందో! ఓసారి చూపిస్తే నష్టం లేదుగా!" అంది పార్వతి.

"సరే. ఇదంతా మోసమని నీ కళ్ళముందే నిరూపిస్తా" అన్నాడు గోపాలం.

మర్నాడు ఇద్దరూ ఉషను తీసుకుని భూతవైద్యుడి దగ్గరకు వెళ్లారు.

అతను ఉషను చూస్తూనే "ఈ పాపకి మీ శత్రువులు చేతబడి చేశారు" అంటూ ఒక నిమ్మకాయను తీసి పార్వతి చేతికిచ్చాడు. ఒక చాకు చేతికిచ్చి ఆ కాయను కోయమన్నాడు.

కాయను కోసే సరికి అందులోంచి ఎర్రని ద్రవం వచ్చింది.

"ఇదుగో చూశారా... ఎవరైనా చేతబడి చేస్తేనే ఇలా నెత్తురు వస్తుంది" అన్నాడు భూతవైద్యుడు.

"ఇది కచ్చితంగా రక్తం అంటారా?" అని అడిగాడు గోపాలం.

"అవును" అన్నాడు భూతవైద్యుడు.

"అలాగా... రక్తం కొంచెం సీసాలో తీసుకుంటాను. పట్నంలో పరీక్ష చేయిస్తాను" అన్నాడు గోపాలం.

వెంటనే కంగారు పడ్డాడు భూతవైద్యుడు.

"దానిని ఇతరులు ముట్టుకోకూడదు. దేవత శపిస్తుంది" అన్నాడు.

"అలాగా -!" అంటూ తన సంచిలోంచి ఒక నిమ్మకాయనీ, ఒక చాకునీ తీసి ఆ కాయను కోశాడు గోపాలం. అందులోంచీ ఎర్రని ద్రవం వచ్చింది.

"చూశారా... నేను తెచ్చిన నిమ్మకాయ కూడా నెత్తురే కార్చింది" అన్నాడు గోపాలం.

భూతవైద్యుడు ఏమీ మాట్లాడలేదు.

"ఇదంతా మోసం! చాకుకు ఆక్సాలిక్ యాసిడ్ అనే రసాయనం రాస్తారు. అది ఆమ్లలక్షణం ఉన్న నిమ్మకాయ రసానికి తగలగానే ఎర్రని ద్రవం వస్తుంది. దానిని చూపి నెత్తురు అని, చేతబడి అనీ డబ్బులు గుంజుతారు భూతవైద్యులు. నీ బండారం బయటపడింది. నీ మీద పోలీసులకు ఫిర్యాదు చేస్తా" అన్నాడు గోపాలం.

"బాబ్బాబు... అంతపని చేయకండి. ఇంక ఈ పని మానేసి బుద్ధిగా ఉంటా!" అన్నాడు భూతవైద్యుడు.

★★★